# ఆస్పత్రి నిర్మాణంలో సందిగ్ధం

- 132/11 కేవీ సబ్‌స్టేషన్ పక్కనే నిర్మాణం
- పొంచి ఉన్న ప్రమాదం
- ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చినా.. ఆగని నిర్మాణం పనులు
- శంకుస్థాపన చేసింది ఒకచోట.. నిర్మాణం మరో చోట
- నిర్మాణం ఆపాలని, కలెక్టర్‌కు ఫిర్యాదు
- మండల పరిషత్‌లో తీర్మానం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ఎక్కడ నిర్మించాలనే విషయమై రగడ కొనసాగుతోంది. మండలంలోని 33 గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రూ.1.56 కోట్లు మంజూరు చేయించగా, నాలుగు నెలల క్రితం భూమిపూజ చేశారు. పాత ఆస్పత్రి భవనం ఎదురుగా ఉన్న స్థలంలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తే, 132/11 కేవీ సబ్‌స్టేషన్‌కు కేవలం 8 మీటర్ల దూరంలోనే నిర్మిస్తున్నారని, దీంతో ప్రమాదం పొంచి ఉందని, అక్కడ నిర్మించొద్దని ఎంపీపీ వెంకటరమణారెడ్డితో పాటు కొంతమంది స్థానిక నాయకులు ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.


నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

## సబ్‌స్టేషన్ పక్కన ప్రమాదమే

రెండేళ్ల క్రితం ఈ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం జరిగితే చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో ఫ్రిజ్‌లు, టీవీలు, ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ దగ్ధమయ్యాయని చెబుతున్నారు. సబ్‌స్టేషన్ పక్కన ఆస్పత్రి నిర్మించాలంటే కనీసం 30 మీటర్ల దూరం ఉండాలని ఓ ప్రజాప్రతినిధి సాక్షికి తెలిపారు. 132/11 కేవీ సబ్‌స్టేషన్ పక్కనే ఆస్పత్రి నిర్మిస్తే సబ్‌స్టేషన్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే ఆస్పత్రిలో ఉండే ల్యాబ్ మిషన్లు, ఎక్స్‌రే మిషన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమవుతాయని అంటున్నారు. అలాగే ఆస్పత్రిలో సుఖప్రసవాల కోసం వచ్చే గర్భిణులకు కూడా రేడియేషన్ ప్రభావం ఉండవచ్చని ప్రజాప్రతినిధులు, స్థానికులు భయపడుతున్నారు. ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన చోటనే ఆస్పత్రి నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అంటున్నారు. పాత ఆస్పత్రికి ముందు భాగంలో స్థలం ఉన్నా పంతానికిపోయి సబ్‌స్టేషన్ పక్కన కడుతున్నారని ప్రజాప్రతినిధులు, స్థానికులు అంటున్నారు. రోడ్డు పక్కన ఆస్పత్రి నిర్మిస్తే అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందని కూడా స్థానికులు చెబుతున్నారు.

## కలెక్టర్‌కు ఫిర్యాదు

సబ్‌స్టేషన్ పక్కన నిర్మించొద్దని, అక్కడ నిర్మాణం చేస్తే అపాయం పొంచి ఉందని, నిర్మాణాన్ని నిలిపి వేయాలని, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన చోట నిర్మించాలని ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీలు కలిసి కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు జిల్లా వైద్యాధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈలకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే ఎంపీపీ వెంకటరమణారెడ్డి సమక్షంలో ఎంపీటీసీలందరూ మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### తీర్మానం చేశాం



సబ్‌స్టేషన్ పక్కనే పీహెచ్‌సీ భవనం నిర్మిస్తే చాలా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కనీసం 30 మీటర్ల దూరంలో ఆస్పత్రి నిర్మించాలని చెప్పినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై కలెక్టర్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు కూడా చేశాం. నిర్మాణం అక్కడ వద్దని తీర్మానం కూడా చేశాం.

– వెంకటరమణారెడ్డి, ఎంపీపీ

### శంకుస్థాపన చేసిన చోటనే నిర్మించాలి



కొత్త బిల్డింగ్‌ను ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన చోటనే నిర్మించాలి. సబ్‌స్టేషన్ పక్కన నిర్మిస్తే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఆస్పత్రి భవనాన్ని ఎలాంటి ఇబ్బందులు లేని చోట నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిర్మాణం మరోచోట చేయించాలి.

– పసుల వెంకటి, పెద్దలింగాపూర్

### అపాయం లేదు

మొదటగా ఆస్పత్రి భవనం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన చోట నిర్మాణం చేస్తామన్నది నిజమే. కాని సబ్‌స్టేషన్ పక్కన స్థలం ఎక్కువగా ఉండటంతో అక్కడే నిర్మించేందుకు పనులు చేపట్టాం. సబ్‌స్టేషన్‌తో ఎలాంటి అపాయం ఉండదని తెలుసుకున్న తర్వాతనే పనులు ప్రారంభించాం.–కిరణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

## క్లుప్తంగా

### అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ మంజుల

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జెడ్పీటీసీ పూర్మాని మంజుల ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రూ.7 లక్షలతో రెడ్డి సంఘం కమ్యూనిటీ భవనం, రూ.6 లక్షలతో మహిళా కమ్యూనిటీ భవన నిర్మాణం, రూ.లక్ష తో బోరు బావి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ మాట్ల మధు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్, మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, మహిళా నాయకులు పాల్గొన్నారు.

### నిరుపేద రెడ్డి కులస్తులకు అండగా నిలవాలి

ముస్తాబాద్: నిరుపేద రెడ్డి కులస్తులకు అందరు అండగా నిలవాలని రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాజరాజేశ్వర రెడ్డి సంఘం భవన నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలు, మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాలను నిర్మించేలా మంత్రితో చర్చిస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు ముద్దం కిరణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కనమెని శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, మనోహర్, నర్సింలు పాల్గొన్నారు.

### రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలి


ర్యాలీలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

ముస్తాబాద్: రాజ్యాధికారం దిశగా గీత కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని గౌడ సామాజిక వర్గం నాయకులు పిలుపునిచ్చారు. ముస్తాబాద్‌లో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయం నుంచి అయ్యప్ప ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈత, తాటి చెట్లు ఎక్కుతూ పనులు చేస్తున్న గీత కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. జీవో నెంబర్ 560 ప్రకారం ప్రతి గ్రామంలో ఐదెకరాలు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులకు ద్విచక్ర వాహనాలు, పనిముట్లు అందించాలన్నారు. జిల్లా కేంద్రాల్లో నీరా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అబ్కారీ అధికారుల వేధింపులు ఆపాలన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలరాజు, ఉపసర్పంచ్ వేముల రవీందర్ గౌడ్, ఎంపీటీసీ శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

## పవర్ కట్

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రంగి: మండల కేంద్రంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఇన్‌చార్జి ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల 33 కేవీ మర్రిగడ్డ, రుద్రంగి లైన్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## నియామకం

### రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వనపట్ల నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడు వనపట్ల మల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి దొంతుల శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పాశం తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, గట్టు వెంకట్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు.

### జిల్లెల్లలో బీఎస్పీ సెక్టార్ సమావేశం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఆదివారం బీఎస్పీ సెక్టార్ సమావేశం జిల్లా కమిటీ సభ్యుడు శ్యాగ యాదగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాంగ ఫలాలు అందాలంటే బీఎస్పీతోనే సాధ్యమన్నారు. డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలంటే 70 మంది బీసీలు ఎమ్మెల్యేలు కావాలన్నారు. బహుజనులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పొన్నాల నర్సింహులు, నాయకులు పొన్నాల రాజు, గడ్డం ధనుంజయ్, కనకయ్య, పోచయ్య, శంకర్, మహేశ్ పాల్గొన్నారు.

### పార్టీ మారే ప్రసక్తే లేదు

- జెడ్పీటీసీ పూర్మాని మంజుల

తంగళ్లపల్లి: తాను పార్టీ మారే ప్రసక్తే లేదని జెడ్పీటీసీ పూర్మాని మంజుల అన్నారు. జిల్లెల్ల గ్రామంలో అభివృద్ధి పనులు భూమిపూజ అనంతరం మీడియాతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తనకు పార్టీ టికెట్ రాదని, దీంతో తాను పార్టీ మారుతున్నట్లు కొందరు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడోసారి కూడా మంత్రి కేటీఆర్ ఆశీర్వాదం తనకే ఉంటుందని బీఆర్‌ఎస్ నుంచే జెడ్పీటీసీగా పోటీలో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. తాను రాజకీయాల్లో ఉండి ఆస్తులు కూడబెట్టలేదని, ఉన్న ఆస్తులు అమ్ముకుంటూ ప్రజలకు సేవ చేస్తున్నానని అన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందు, ఇప్పుడు తన ఆస్తులు ఎన్నో చూడాలన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు మండల వ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

## బోనాల జాతర


వేములవాడ: బోనం ఎత్తిన మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి


సిరిసిల్లటౌన్: బోనంతో నృత్యం చేస్తున్న యువకుడు

సిరిసిల్ల పట్టణంలో నెహ్రూనగర్, సుభాష్‌నగర్, వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, సాయినగర్, విద్యానగర్‌కు చెందిన పద్మశాలీ కులస్తులు, ఇల్లంతకుంట మండలంలోని సోమారంపేట పోచమ్మ, తంగళ్లపల్లి మండలంలోని తాడూర్ గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుల చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకుని వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. పోతరాజు విన్యాసాలు పలువురి ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్ గూడూరి లక్ష్మి, సిరిసిల్ల కౌన్సిలర్లు రామానుజం, సామల సుప్రియ, లగిశెట్టి ప్రకాశ్, పోశెట్టి, అంబ భవాని, ఇల్లంతకుంట ఎంపీపీ వెంకటరమణారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి బోనాలెత్తుకున్నారు.

– సిరిసిల్లటౌన్/వేములవాడ/ఇల్లంతకుంట


తంగళ్లపల్లి: తాడూర్‌లో బోనాలతో మహిళలు


సిరిసిల్లలో నెత్తిన బోనాలతో మహిళలు

### ఆర్యవైశ్యుల దిష్టికుంభం


ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు

వేములవాడ: ఆషాఢమాసం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్యులు మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం దిష్టికుంభం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

### గ్రామ దేవతలకు పూజలు.. వన భోజనాలు

ముస్తాబాద్: మండలంలో వివిధ సామాజికవర్గాలకు చెందిన వారు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ముదిరాజ్, యాదవ, పద్మశాలీ, రజక, విశ్వబ్రాహ్మణులు పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరువాడ బాగుండాలని, వానలు కురిసి పంటలు పండాలని ఆషాఢ మాసం సందర్భంగా గ్రామ దేవతలకు పూజలు చేశారు. అనంతరం వన భోజనాలకు తరలివెళ్లి ఉత్సాహంగా గడిపారు.

### కాంగ్రెస్ నాయకుడికి 'పొన్నం' పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తండ్రి లక్ష్మీరాజం గౌడ్ ఇటీవల మృతి చెందగా ఆదివారం శ్రీనివాస్‌గౌడ్‌ను కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**మనోహర్‌రెడ్డి పరామర్శ**

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ తండ్రి గొడిశెల రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాజశేఖర్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

## తొమ్మిదో ప్యాకేజీ పూర్తి చేయడంలో విఫలం

- హామీలను మరిచిన కేటీఆర్‌కు ఓటమి తప్పదు
- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


వీర్నపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న కేకే

ముస్తాబాద్/వీర్నపల్లి: బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఎగువ మానేరుకు గుండెకాయ వంటి తొమ్మిదో ప్యాకేజీ పనులను పూర్తిచేయలేదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ముస్తాబాద్ మండలం తుర్కపల్లి, చిప్పలపల్లి, వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల, మద్దిమల్ల తండా, బంజేరు తండా గ్రామాల్లో కాంగ్రెస్ జెండా పండగను ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. తొమ్మిదో ప్యాకేజీ సాగునీటి పనులను పూర్తి చేయించడంలో మంత్రి కేటీఆర్ విఫలమయ్యారన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని, బతుకమ్మ చీరలలో దోపిడీ జరిగిందన్నారు. గల్లీకో బెల్టుషాపుతో ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తూ వారిని బిచ్చగాళ్లను చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీడీ కార్మికులకు, వితంతువులు, వృద్ధులకు, నేత, గీత కార్మికులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామన్నారు. వీర్నపల్లిలో పారిశుధ్య కార్మికులకు సమ్మెకు సంఘీభావం తెలిపారు. పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షులు యెల్ల బాల్‌రెడ్డి, భూత శ్రీనివాస్, దొమ్మాటి నర్సయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు పాల్గొన్నారు.

### నాలుగో రోజు సమ్మె


మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం నాల్గో రోజుకు చేరింది. తంగళ్లపల్లిలో సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలతో సరిపెట్టే కేసీఆర్ గ్రామపంచాయతీ కార్మికుల విషయంలో కూడా అదే అస్త్రాన్ని ఉపయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చి సమ్మె విరమింపజేయాలని లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, కాశీచరణ్, శ్రీధర్‌రావు, సిరిసిల్ల వంశీ, ఎల్లారెడ్డిపేటలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మహేందర్, గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, ఉపాధ్యక్షులు నర్సయ్య, రామదాసు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్‌కు రోడ్డు పడింది


నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ వరకు సుమారు 800 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. పాఠశాల నిర్మించి పదేళ్లు అవుతున్నా, పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సీసీ రోడ్డు నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పలుమార్లు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మించారు

**తప్పిన కష్టాలు**

పదేళ్లుగా వర్షం పడితే నడిచేందుకు కూడా వీలులేకుండా బురద ఉండేదని, పొలం గట్లపై నుంచి పాఠశాలకు వెళ్లిన రోజులున్నాయని, కాని ఇప్పుడు సీసీ రోడ్డు వేయడంతో వాహనాలు పాఠశాల వరకు వెళ్తున్నాయని, తమకు ఇక రోడ్డు లేదనే ఇబ్బంది పోయిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వ్యవసాయ భూములు ఉండటంతో రోడ్డును వెడల్పు చేసేందుకు మొదటగా రైతులు ససేమిరా అనడంతో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు వారితో మాట్లాడి పనులు సాఫీగా జరిగేందుకు తోడ్పడ్డారు. త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సీసీ రోడ్డును ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## సంక్షిప్త వార్తలు

**కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు**

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాకు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రానుందన్నారు. కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, సంఘస్వామి యాదవ్, ఎల్లారెడ్డి ఉన్నారు.

**గీత కార్మికుడికి ఆర్థికసాయం**

బోయినపల్లి: ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డ మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొంగాని రామస్వామికి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదురు గోవర్ధన్‌గౌడ్ ఆదివారం రూ.ఐదు వేలు, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మిపతి రూ.వేయి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు బొంగాని అశోక్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ బూత్ కమిటీల ఎన్నిక**

వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్‌నాయక్, భూక్య తండా, బాబాయి చెరువు తండా గ్రామాల్లో బూత్ కమిటీలను జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, గ్రామ సర్పంచులు సుజాత, భారతి, గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి, రవి, ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

**పేదలకు అన్నదానం**

వేములవాడ: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ పరిసరాల్లోని పేదలకు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం అన్నదానం చేశారు. నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజ్, రఫీక్, ప్రతాప రఘు, గొండ ప్రసాద్ పాల్గొన్నారు.

**డీటీఆర్ మంజూరు**

ఎల్లారెడ్డిపేట: స్థానిక మేజర్ గ్రామపంచాయతీలోని 13, 14 వార్డుల్లో విద్యుత్ హై, లోఓల్టేజీ నివారణకు సింగిల్ ఫేస్ డీటీఆర్ మంజూరు చేశారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ ద్వారా సెస్ ఏఈఈ దివ్య దృష్టికి తీసుకుపోగా, స్పందించి ఆదివారం డీటీఆర్ ఏర్పాటుకు ఆదివారం సెస్ సిబ్బందితో పాటు నాయకులు బాల్‌రాజ్‌యాదవ్, ఎనగందుల బాబు, చెన్ని బాబు, రెండు వార్డుల ప్రజలు స్థల పరిశీలన చేశారు.

**మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం**

ముస్తాబాద్: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మండలంలోని మోహినికుంటకు చెందిన కొట్టూరి రాజమౌళి కుటుంబానికి రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం ఆదివారం అందించాడు.

**వేములవాడ అబ్కారి ఎస్సైకి సన్మానం**

వేములవాడరూరల్: వేములవాడ అబ్కారి ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎస్సై శ్రీనివాస్‌ను ఆదివారం స్థానిక గౌడ సంఘం నాయకులు సన్మానించారు. చంద్రగిరి శ్రీనివాస్, చిరంజీవి, ఎల్లాగౌడ్, నాగుల మహేశ్, దూలం భూమేశ్, వస్తాది కృష్ణ, గడ్డమీది రాజు పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

బోయినపల్లి: మండలంలోని మర్లపేట గ్రామంలో డీఎస్పీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు ఎడపెల్లి బాబు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కరీంనగర్‌లో ఈనెల 10న జరిగే ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గడప గడపకు ధర్మ సమాజ్ పార్టీని పరిచయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, బడుగులకు రాజ్యాధికారం తీసుకు రావడం లక్ష్యమని తెలిపారు. కొమ్ము విక్రమ్ పాల్గొన్నారు.

### సెస్ ఏఈ దివ్య బదిలీ

ఎల్లారెడ్డిపేట: మండల సెస్ ఏఈ దివ్య కోనరావుపేటకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కోనరావుపేట ఏఈ పృథ్వీధర్‌ను నియమించారు. మండల సెస్ అధికారిగా విధుల్లో చేరిన దివ్య విద్యుత్ సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించారు. లూజ్‌లైన్ల సమస్య పరిష్కారానికి స్తంభాలు వేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే తక్షణమే స్పందించేవారు.